www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 188, ఆదివారం 9-8-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

1.2 మెగా వాట్స్ రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను సందర్శించిన డైరక్టర్ ఎం. తిరుమల రావు



4 లో..

వాహనాలను తనిఖీ చేసిన పోలీస్ అధికారులు




4వ పేజీల్లో

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

## తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు

నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది

నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సిఎం రేవంత్ రెడ్డి

మీడియా సమావేశంలో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్, ఆగస్టు 8 :**

క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగా పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదని పేర్కొన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదని అన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని

..మిగతా 2లో

యూఏఈ బతుకమ్మ సంబురాలకు

## కేటీఆర్‌కు ఆహ్వానం

2



## వైసీపీ కుట్రలను తిప్పి కొట్టాలి

దుష్ప్రచారాన్నిఎండగట్టాలి... వైసీపీ తీరుపై

డిఎస్సీ రిక్రూట్ టీచర్లే ఆందోళన

మంచి పనులు చేస్తే ప్రజలు సహకరిస్తారు

భోగాపురం ఎయిర్ పోర్టునే నిదర్శనం

సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

యూనిట్ ఇన్ చార్జిల శిక్షణ తరగతులకు హాజరు

**అమరావతి ఆగస్టు 8 :**

టీడీపీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇన్‌ఛార్జిలకు శిక్షణా తరగతులను నిర్వహించారు. శిక్షణా తరగతులకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ప్రభుత్వ పథకాలు, పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల్లో నాయకత్వం పెంపొందించడానికే శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకోవాలని.. ప్రభుత్వం చేసే మంచిని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రభుత్వం చేసిన మంచిని చెప్పుకోకుంటే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుందన్నారు. చిన్న

..మిగతా 2లో




## హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

వేలదిగా తరలివచ్చిన నిరుద్యోగులు

సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట

**హైదరాబాద్, ఆగస్టు 8:**

నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో

..మిగతా 2లో

## నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

సరూర్ నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం

ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

2

## ఏడేళ్లు దాటినా హత్య మిస్టరీ వీడలేదు

ఆ నాలుగు కీలకాంశాలపై దర్యాప్తు చేయాలి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వైఎస్ సునీత లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 8 :**



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు వివేకా కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి సంచలన లేఖ రాశారు. ఏడేళ్లు దాటినా ఈ కేసు మిస్టరీ ఇంకా తేలలేదని పేర్కొన్నారు. 'ఆ నాలుగు కీలక అంశాలపై' దర్యాప్తు

..మిగతా 2లో

## లోయలో పడ్డ బొలెరో వాహనం

ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం



**నైనిటాల్, ఆగస్టు 8 :**

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బొలెరో వాహనం లోయలో పడ్డ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వెళుతున్న బొలెరో వాహనం శుక్రవారం సాయంత్రం సబ్దర్‌ఖల్ వద్ద ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్క ఉన్న లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న

...మిగతా 2లో




## యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమే

ఎటువంటి చార్జీలు విధించబోం

ఫోన్ పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం

**న్యూఢిల్లీ ఆగస్టు 8 :**

భారతీయ యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు విధించబోమని ఫోన్‌పే సీఈవో సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ లావాదేవీల కోసం వినియోగదారులు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, ఈ సేవలు ఎప్పటికీ ఉచితంగానే కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007 లోక్‌సభలో ఆమోదం పొందిన తర్వాత డీజిటల్ పేమెంట్లపై ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో నిగమ్ ఈ మేరకు స్పందించారు. మరోవైపు, చిరు వ్యాపారులకు ఉచిత యూపీఐ సేవలు యథావిధిగా

..మిగతా 2లో

## భారత్‌లో ఏఐతో ఉద్యోగాలు పోవు



జాబ్స్ వచ్చే అవకాశాలు ఎక్కువ

ఏఐ రంగంలో 83, 100 నియామకాలు

తొలగించినది కేవలం 83,100 మాత్రమే

నోమురా ఆర్థికవేత్తల విశ్లేషణలో వెల్లడి

**న్యూఢిల్లీ ఆగస్టు 8 :**

కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా ఉద్యోగాలు భారీగా తగ్గిపోతాయని చాలాకాలంగా చర్చ జరుగుతోంది. అయితే తాజా అధ్యయనం ఈ అభిప్రాయానికి భిన్నమైన చిత్రాన్ని చూపిస్తోంది. ప్రపంచంలోని పలు కంపెనీలకు 'బ్యాక్ ఆఫీస్'గా సేవలందిస్తున్న భారత్.. ఏఐ ఉద్యోగాలపై ప్రభావాన్ని అంచనా వేయడానికి కీలకమైన పరీక్షా వేదికగా మారుతోందని నోమురా హోల్డింగ్స్ ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. నోమురా ఆర్థికవేత్తలు సోనల్ వర్మ, సియింగ్ తోహ్ రూపొందించిన నివేదికలో ఆసియాలో ఏఐ కారణంగా ఏర్పడుతున్న ఉద్యోగాలు, తొలగింపులు, నియామకాల నిలిపివేత వంటి అంశాలను విశ్లేషించారు. 2022 నుంచి 2026

..మిగతా 2లో



సాగునీటి ప్రాజెక్టులకు

## 5వేల కోట్లు మంజూరు

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం

తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 8 :**

సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, ఆర్‌ఆర్ కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో

..మిగతా 2లో

# భారత్‌లో ఏఐతో ఉద్యోగాలు పోవు

మొదటి పేజీ తరువాయి...

ఆగస్టు వరకు అందుబాటులో ఉన్న 69 ఉదాహరణలను ఈ అధ్యయనంలో పరిశీలించారు. నివేదిక ప్రకారం, భారత్‌లో ఈ కాలంలో ఏఐకి సంబంధించిన విభాగాల్లో 83,100 మంది నియామకాలు జరిగాయి. అదే సమయంలో ఏఐ ప్రభావంతో ఉద్యోగాలు కోల్పోవడం, ఉద్యోగ విరమణ వంటి వాటి సంఖ్య 31,921గా ఉంది. అంటే ప్రస్తుత దశలో భారత్‌లో ఏఐ కారణంగా కోల్పోతున్న ఉద్యోగాల కంటే, ఏఐ ఆధారంగా ఏర్పడుతున్న కొత్త ఉద్యోగాల సంఖ్య గణనీయంగా ఎక్కువగా ఉంది. నోమురా విశ్లేషణ ప్రకారం.. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో ఎక్కువగా సపోర్ట్ టీమ్‌లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. చాట్‌బాట్‌లు, ఆటోమేషన్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం ద్వారా ఈ పనులను సంస్థలు తగ్గిస్తున్నాయి. మరోవైపు, ఏఐ పై పెరుగుతున్న డిమాండ్ కారణంగాఐటీ సర్వీసెస్ రంగంలో కొత్తగా ఉద్యోగాలు కల్పిస్తున్నాయి.

**ఫ్రెషర్లకు పోటీ పెరిగే అవకాశం**

ఏఐ ప్రభావంతో ఉద్యోగ మార్కెట్‌లో ఒక కొత్త రకమైన మార్పు కనిపిస్తోందని నోమురా పేర్కొంది. భారత్, కొరియా వంటి దేశాల్లో రెండు స్థాయిల లేబర్ మార్కెట్ ఏర్పడుతున్నట్లు ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఒకవైపు ఎంట్రీ లెవల్ ఉద్యోగులపై డిమాండ్ తగ్గుతుండగా.. మరోవైపు అనుభవం ఉన్న ఉద్యోగులు, వ్యాపార అవసరాలను లోతుగా అర్థం చేసుకున్న నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఇది ముఖ్యంగా ఫ్రెషర్లకు కీలకమైన సంకేతంగా చెప్పవచ్చు. కేవలం సాధారణ ఐటీ నైపుణ్యాలు ఉంటే సరిపోకపోవచ్చు. ఏఐ టూల్స్‌తో పనిచేయడం, సమస్యలను పరిష్కరించడం, వ్యాపార అవసరాలను అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలు భవిష్యత్తులో మరింత కీలకం కావచ్చు. భారత్ మాత్రమే కాదు.. ఆసియా మొత్తం మీద కూడా ఇదే తరహా పరిస్థితి



కనిపిస్తోంది. అధ్యయనం చేసిన కాలంలో ఆసియాలో ఏఐకి సంబంధించిన 1,30,758 ఉద్యోగాలు ఏర్పడ్డాయి. వీటిలో 90 శాతానికి పైగా ఉద్యోగాలు టెక్నాలజీ రంగంలోనే ఉన్నాయి. అదే సమయంలో ఏఐ ప్రభావంతో సుమారు 60,654 ఉద్యోగాలు కోల్పోయినట్లు నివేదిక పేర్కొంది. వీటిలో దాదాపు 60 శాతం ఉద్యోగ నష్టాలు ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో చోటుచేసుకున్నాయి. భారత్, చైనా వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలతో పాటు ఫిలిప్పీన్స్‌లోనూ ఇదే ధోరణి కనిపిస్తోందని నోమురా తెలిపింది. ముఖ్యంగా బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ రంగంపై ఆధారపడిన దేశాల్లో ఏఐ ప్రభావం వేగంగా కనిపిస్తోంది.

**అయితే అందరికీ సమానంగా ప్రయోజనం ఉండదు**

ఏఐ వల్ల ఉద్యోగాల సంఖ్య మొత్తం మీద పెరుగుతున్నప్పటికీ.. దీనివల్ల ప్రతి ఉద్యోగికి సమానంగా ప్రయోజనం లభిస్తుందని చెప్పలేం. ఏఐ కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన వారు నేరుగా ఏఐ ఇంజినీరింగ్ లేదా ఇతర అధిక నైపుణ్య ఉద్యోగాల్లోకి మారడం చాలా అరుదు. దీంతో ఏఐ ఒకవైపు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తూనే.. మరోవైపు కొన్ని రకాల సంప్రదాయ ఉద్యోగాలకు డిమాండ్‌ను తగ్గించే అవకాశం ఉంది. అందువల్ల భవిష్యత్తులో ఏఐ నైపుణ్యాలు ఉన్నవారు, అనుభవం కలిగిన ఉద్యోగులు, వ్యాపార పరిజ్ఞానం ఉన్న నిపుణులకు ఎక్కువ అవకాశాలు లభించే అవకాశం ఉంది. సాధారణంగా పునరావృతమయ్యే పనులు చేసే ఉద్యోగాలపై మాత్రం ఆటోమేషన్ ప్రభావం ఎక్కువగా ఉండొచ్చు.

**యువత ఏం చేయాలి?**

ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయా? అనే భయంతో కాకుండా.. ఏఐతో కలిసి పనిచేయగల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం యువతకు ముఖ్యమైన వ్యూహంగా మారుతోంది. ముఖ్యంగా ఐటీ, డేటా అనాలిసిస్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మార్కెటింగ్, ఫైనాన్స్ వంటి రంగాల్లో ఏఐ టూల్స్‌పై అవగాహన పెంచుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. అదే సమయంలో కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం, క్రిటికల్ థింకింగ్, డొమైన్ నాలెడ్జ్ వంటి మానవ నైపుణ్యాలు కూడా చాలా కీలకం. ఎందుకంటే ఏఐ టూల్‌ను ఉపయోగించడం కంటే.. దాన్ని సరైన సందర్భంలో ఎలా ఉపయోగించాలో అర్థం చేసుకునే నిపుణులకు భవిష్యత్తులో ఎక్కువ విలువ ఉండే అవకాశం ఉంది. మొత్తంగా.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాలను చూస్తే ఏఐ వల్ల ఉద్యోగాలు పూర్తిగా అంతరించిపోతున్నాయనే దానికంటే.. ఉద్యోగాల స్వరూపం మారుతోందనే విషయం స్పష్టమవుతోంది. కొత్త రకాల ఏఐ ఆధారిత ఉద్యోగాలు ఏర్పడుతుండగా, కొన్ని సంప్రదాయ ఉద్యోగాలకు డిమాండ్ తగ్గుతోంది. అయితే నోమురా నివేదికలోని గణాంకాలను ఖచ్చితమైన మొత్తం ఉద్యోగ సంఖ్యలుగా చూడకూడదని ఆర్థికవేత్తలు హెచ్చరించారు. ఆసియా ఉద్యోగ మార్కెట్ విభిన్నంగా ఉండటంతో పాటు, ఈ విశ్లేషణ వార్తా నివేదికల ఆధారంగా రూపొందించబడింది. కాబట్టి ఇవి విస్తృత ధోరణులను సూచించే గణాంకాలుగా చూడాలి.



# కుట్రలను తిప్పి కొట్టాలి

మొదటి పేజీ తరువాయి...

పామునైనా పెద్ద కర్రతో కొట్టాలని... గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని నిర్దేశించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని.. దానికి గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగామని సీఎం వెల్లడించారు. డీఎస్సీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని చక్కగా చెప్పగలిగామన్నారు. కాబట్టే... గొడ్డలి పార్టీ మినహా కొన్ని పార్టీలకు చెందిన నేతలు ఎలాంటి తప్పులు జరగలేదని బహిరంగంగానే చెబుతున్నారని తెలిపారు. డీఎస్సీ ద్వారా రిక్రూటైన టీచర్లే శనివారం గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళన చేపట్టారన్నారు. ప్రభుత్వం చేసే మంచిని ప్రజలకు వివరించగలిగితే... గొడ్డలి పార్టీ కుట్రలను ప్రజలే అడ్డుకుంటారని చెప్పారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనే దానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే నిదర్శనమన్నారు. పారదర్శకంగా వ్యవహరించి.. వాస్తవాలు చెబితే ప్రజలే కుట్రలను ఛేధిస్తారనడానికి కర్నూలులో గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా టీచర్ల ఆందోళనే ఉదాహరణ అని సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులున్నా... వ్యవస్థలను గాడిలో పెట్టి సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సాధారణ కార్యకర్తకైనా, పార్టీ అగ్రనాయకుడికైనా పార్టీనే సుప్రీం అని అన్నారు. ఏయే నియోజకవర్గాల్లో ఏమేం జరుగుతున్నాయనే అంశాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని తెలిపారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని.. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో జీరో టాలరెన్స్ అని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదన్నారు. ఏ ఎన్నికలు జరిగినా... ప్రతి బూత్‌లోనూ గడిచిన ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువే రావాలని సూచించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై చాలా ప్రభావం చూపుతుందన్నారు. యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, మండల అధ్యక్షులకు గౌరవం దక్కేలా చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# ఏడేళ్లు దాటినా హత్య మిస్టరీ వీడలేదు

మొదటి పేజీ తరువాయి...

జరగాల్సిందేనని ఆమె విజ్ఞప్తి చేశారు. హత్య జరిగి ఏడేళ్లవుతున్నా ఇందుకు సంబంధించిన ఆయుధం ఇంకా దొరకలేదని తెలిపారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తుపై సునీతారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.కోట్ల మనీ ట్రయల్, హత్య వెనుక ఉన్న 'పెద్ద కుట్ర' కోణాన్ని పూర్తిగా వెలికితీయాలని రాష్ట్రపతికి సునీతారెడ్డి విన్నవించారు. మరణవార్త బయటకు రాకముందే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఎలా తెలిసింది? అని ప్రశ్నించారు. సీబీఐ అఫిడవిట్ ఆధారంగా ఈ కేసును విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో ఇంకా ఉన్న 'అస్పష్ట అంశాలపై' విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో గతంలో అప్పీల్ చేశానని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ - తెలంగాణ సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డిలకు కూడా లేఖ ప్రతులను డాక్టర్ సునీతారెడ్డి పంపించారు.

# యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమే

మొదటి పేజీ తరువాయి...

అందుబాటులో ఉంటాయని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే, యూపీఐ సహా ఇతర నోటిఫై ఎలక్ట్రానిక్ పేమెంట్స్ విధానాల ద్వారా జరిగే చెల్లింపులపై ఛార్జీలు విధించే అవకాశాన్ని ప్రభుత్వానికి కల్పించేలా చట్ట సవరణ బిల్లు రూపొందించారు. అయితే, దీనర్థం వినియోగదారుల నుంచి నేరుగా యూపీఐ లావాదేవీ ఛార్జీలు వసూలు చేస్తారని కాదని పీసీఐ ఇదివరకే తెలిపింది. 2016లో యూపీఐ ప్రారంభమైనప్పటి నుంచి వినియోగదారులకు ఈ సేవలు ఎల్లప్పుడూ ఉచితంగానే అందుతున్నాయని పీసీఐ ఎక్స్ పోస్టులో పేర్కొంది. భవిష్యత్తులోనూ ప్రతి భారతీయుడు ఎలాంటి లావాదేవీ రుసుము లేకుండా తక్షణ డిజిటల్ చెల్లింపులు చేసుకోవచ్చని తెలిపింది. కాగా, రూ.1.5 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగి ఉండే కార్పొరేట్ సూపర్ మార్కెట్లు, షాపింగ్ మాల్స్, లగ్జరీ హోటళ్ల వంటి వాటిల్లో రూ.2,000 కంటే ఎక్కువ విలువైన చెల్లింపులపైనే ఎండీఆర్ ఛార్జీలు విధించే అవకాశం ఉందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే భవిష్యత్తులో ఇతర లావాదేవీలకూ ఆ ఛార్జీలు వర్తింపజేస్తారన్న భయాలు ప్రజల్లో నెలకొన్న నేపథ్యంలో సీఈవో ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా, యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. యూపీఐ సహా ఇతర నోటిఫైడ్ డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, సర్వీస్ ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది. ఇందుకోసం, 2007 నాటి పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టాన్ని సవరించారు. ముఖ్యంగా, యూపీఐ, రూపే డెబిట్ కార్డుతో చేసే డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేటు ఛార్జీలు విధించకుండా ఉన్న నిబంధనను తొలగించారు. దీంతో ఇకపై ఏ డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు ఉండాలో కేంద్రమే నోటిఫికేషన్ ద్వారా నిర్ణయం తీసుకోనుంది. ఇందుకు సంబంధించి, డిజిటల్ పేమెంట్ వ్యవస్థను నడిపే బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు ఆదాయం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం బిల్లులో సవరణలు చేసిందని వర్గాలు తెలిపాయి.

# తాగిన మైకంలో సూసైడ్ నోట్ రాసా

**హైదరాబాద్ ఆగస్టు 8:**

సంచలనంగా మారిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో రోజుకో కొత్త ట్విస్ట్ వెలుగుచూస్తోంది. తనపై తోటి ట్రైనీ ఆఫీసర్ లైంగిక ఆరోపణలు చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఉదయ్.. కొన్ని రోజుల క్రితం సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్యాయత్నం చేశాడని బాగా ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం ఈ కేసు ఈ సూసైడ్ నోట్ చుట్టే తిరుగుతోంది. ఈ నోట్‌ను ఉదయ్ కృష్ణారెడ్డి మాయం చేసినట్టు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. అంతేకాదు, సూసైడ్ నోట్‌లో అన్ని ఆధారాలను ఐఫోన్‌లో పొందుపరిచానని రాసిన ఉదయ్ కృష్ణారెడ్డి.. ఆ ఐఫోన్‌ను కూడా మాయం చేసినట్టు పోలీసులు గుర్తించారు. సూసైడ్ నోట్‌లో రాసిన వివరాల గురించి ప్రశ్నించగా.. తాను తాగిన మైకంలో ఈ నోట్ రాశానని, ఆ నోట్ ఇప్పుడు ఎక్కడ ఉందో తనకు తెలియదని ఉదయ్ చెబుతున్నట్టు పోలీసులు తెలిపారు. అలాగే ఆ నోట్ బయటకు ఎలా వచ్చిందనే దానిపై కూడా ఉదయ్ ఎలాంటి సమాధానం చెప్పలేదని పోలీసులు తెలిపారు. దీంతో మరోసారి ఉదయ్‌ను పోలీస్ కస్టడీకి అనుమతించాలని కోరుతూ ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఉదయ్ విచారణకు సహకరించలేదని, అతని నుంచి మరికొన్ని కీలక విషయాలు రాబట్టాల్సి ఉందని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. మొత్తానికి ఇప్పుడు ఈ కేసు వ్యవహారం మొత్తం ఉదయ్ రాసిన ఆ సూసైడ్ నోట్ చుట్టే తిరుగుతోంది. మరో కస్టడీలోనైనా ఉదయ్ నోరు విప్పుతారా లేదా అన్నది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

## క్షుద్ర రాజకీయాలు
# కాంగ్రెస్‌కే చెల్లు

మొదటి పేజీ తరువాయి...

ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు.కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నదని, ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముళ్లు కట్టెతో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

మొదటి పేజీ తరువాయి...

హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడం తో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు. హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీ సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన ఘటనలపై హరీశ్ రావు 'ఎక్స్'వేదికగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని.. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

# లోయలో పడ్డ బొలెరో వాహనం

మొదటి పేజీ తరువాయి...

వెంటనే దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బొలెరోలో ఒకే కుటుంబానికి చెందిన 7 మంది ఉన్నారు. వాహనం లోయలో పడగానే తీవ్రగాయాలపాలై ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని సహాయక సిబ్బంది దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# విశాఖకు వందేభారత్ స్లీపర్

**న్యూఢిల్లీ ఆగస్టు 8 :**

విశాఖపట్నం, ఐటీ రాజధాని బెంగళూరు మధ్య ప్రయాణించే ప్యాసింజర్లు, ఉద్యోగులకు దక్షిణ తీర రైల్వే తీపి కబురు అందించింది. ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించేందుకు కొత్తగా 'వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్' రైలును నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు సమగ్ర నివేదికను తుది ఆమోదం కోసం రైల్వే బోర్డుకు పంపింది. ప్రస్తుతం వైజాగ్ -- బెంగళూరు మధ్య నడిచే సాధారణ రైళ్లకు 17 నుంచి 21 గంటల సమయం పడుతోంది. అయితే, ఈ కొత్త వందే భారత్ స్లీపర్ అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం కేవలం 15 గంటల కంటే తక్కువకే తగ్గిపోనుంది. వారంలో ఆరు రోజుల పాటు ఈ సర్వీసును నడపాలని ప్రతిపాదించారు. బెంగళూరులో రాత్రి 8:00 గంటలకు బయలుదేరే రైలు మరుసటి రోజు ఉదయం 10:00 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో వైజాగ్‌లో రాత్రి 8:15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10:00 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైలు గుంటూరు, విజయవాడ, నంద్యాల, ధర్మవరం మీదుగా దాదాపు 1,061 కిలోమీటర్ల మేర సాగనుంది. మార్గమధ్యంలో కృష్ణా కెనాల్ జంక్షన్, దువ్వాడ వంటి కీలక స్టేషన్లలో స్టాప్‌లు ఉంటాయి. సాధారణంగా వందే భారత్ స్లీపర్ రైళ్లు 16 కోచ్‌లతో నడుస్తుండగా, ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ఏకంగా 20 కోచ్‌ల భారీ రేక్‌తో నడపాలని నిర్ణయించారు. గంటకు 160 కి.మీ గరిష్ఠ వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉన్నప్పటికీ, ట్రాక్ పరిస్థితుల దృష్ట్యా సగటున 75 కి.మీ వేగంతో నడపనున్నారు. విమాన ప్రయాణానికి ధీటుగా ఉండే ఈ స్లీపర్ రైలు ఐటీ నిపుణులకు, తెలుగు ప్రజలకు ఎంతో ఊరటనివ్వనుంది.

# హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి...

పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ తీవ్ర గందరగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్టల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యోగులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. టోకెన్‌లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనాలని నిర్వాహకులు చెబుతున్నారు.

## సాగునీటి ప్రాజెక్టులకు
# 5 వేల కోట్లు మంజూరు

మొదటి పేజీ తరువాయి...

మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణెళి లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

## యూఏఈ బతుకమ్మ సంబురాలకు
# కేటీఆర్‌కు ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి...

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏ--యూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం నంది నగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రతినిధులు కేటీఆర్‌కు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రతి ఏటా బతుకమ్మతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి అక్టోబర్ 11, 2026న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్లో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కేటీఆర్‌ను కోరారు.

# సాహిత్యంలో లెజెండ్ గద్దరన్న

**- గద్దర్ వర్ధంతి సభలో జన నాట్యమండలి నాయకుడు సంజీవ్**
**- హనుమకొండలో ఘనంగా గద్దర్ వర్ధతి సభ**






**వరంగల్, ఆగస్టు 8 (భద్రాద్రిన్యూస్):** జనం సమస్యలకు జనం బాషను, జనం యాసను, భౌతికవాదాన్ని జోడించి సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించిన గొప్ప కవి, కళాకారుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ సాహిత్యంలో లెజెండ్ అని జననాట్యమండలి నాయకుడు సంజీవ్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో గద్దర్ గళం ఆధ్వర్యంలో విసికె పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ 3 వ వర్ధంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన ఆయన మాట్లాడారు. తరతరాలుగా దేశంలో జరుగుతున్న దోపిడి, దేశ భూస్వామ్య, పాలకుల దోపిడీకి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ తోడై దోపిడి ఎలా కొనసాగిందో, ఆ దోపిడిలో చిక్కుకున్న ప్రజలు ఎలా విలవిలలాడారో గద్దర్ ప్రతి పాటలో కనపడుతుందని అన్నారు. ప్రజల అజ్ఞానం, మూఢనమ్మకాలు, పాలకుల దోపిడి, పోలీసుల ప్రవర్తనపై ప్రజల బాషలో, పలు భాషల్లో పాడి ప్రజలను చైతన్యం చేసి ప్రజా యుద్ధానికి సిద్ధం చేసిన యుద్ధ నౌక గద్దర్ ప్రపంచంలోనే గొప్పవాడని అన్నారు. గద్దర్ అజ్ఞాతంలో ఉన్నపుడు అన్న కోసం మూడు సంవత్సరాలు ఆటో నడిపి గద్దరన్నను సాధుకున్నట్లు ఆవేదనతో మాట్లాడాడు. సాంస్కృతిక ఉద్యమంలో నిర్మాణాత్మకమైన సమస్యల గురించి గద్దర్ వ్రాశాడని, సామ్రాజ్యవాదం గురించి, అమెరికా దోపిడి గురించి రచించి పాడిన గద్దర్ కార్మికుల గురించి, కర్షకుల గురించి, మహిళల గురించి, కూలీల గురించి, తల్లుల త్యాగం గురించి, విద్యార్థుల త్యాగాల గురించి ఏ వర్గాన్ని కూడా విస్మరించకుండా చైతన్యపరిచి తన జీవితాంతం పోరాటం చేశాడని అన్నారు. ఆయా వర్గాల సమస్యలపై, ప్రజల విముక్తికై గద్దరన్న పాడిన పాటలను సంజీవన్న పాడి సభను ఉత్తేజపరిచారు. గద్దరన్న ఆశయ సాధన కోసం ఆయన లాగ అంకితబావంతో కృషి చేయడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అవుతుందని అన్నారు.

డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్యూడలిజంతో ప్రజాస్వామిక చర్చలు సాధ్యం కావని, అందుకే పీడిత వర్గాలు విప్లవించాయని అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన గద్దర్ గళం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ పాలకులు గద్దర్ పేరును మాత్రమే వాడుకుంటున్నాయని, ఆయన ఆశయాలకు విరుద్ధంగా పని చేస్తున్నారని విమర్శించారు. గౌరవ అతిథి యశపాల్ మాట్లాడుతూ జనపదాలను విప్లవీకరించాలనే లక్ష్యంతో గద్దర్ అద్భుతమైన పాటలు రాశాడని వివరించారు. గద్దర్ పేరుతో ఒక సాహిత్య సాంస్కృతిక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. గద్దర్ విగ్రహాన్ని హన్మకొండలో ఏర్పాటు చేయాలని ప్రొ. తిరునహరి శేషు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎగ్గడి సుందర్ రామ్ స్వాగతం పలుకగా సిపిఎం నాయకులు చుక్కయ్య, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, హేతువాద సంఘం రాష్ట్ర నాయకులు రమక్క, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లన్న, అసంఘటిత కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు నలిగింటి చంద్రమౌళి, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, డాక్టర్ మంద వీరస్వామి, తెలంగాణ శ్యాం, సీనియర్ న్యాయవాదులు పులి సత్యనారాయణ, రామస్వామి, షేక్ అబ్దుల్ నబీ, విలాసాగరం సురేందర్ గౌడ్, బండి మొగిలి, సారంగపాణి, రాచకొండ ప్రవీణ్ కుమార్, వివిధ సంఘాల నాయకులు వలి ఉల్లా ఖాద్రీ, నున్న అప్పారావు, నరోత్తమ్ సూరీ, డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, కోంద్ర నరింగరావు, దూడల సాంబయ్య, సింగారపు అరుణ న్యాయవాదులు గురిమిల్ల రాజు, ప్రభంజన్, రాజేందర్, చెరిపెల్లి ఆనంద్, కామ్రేడ్ వివిధ సంఘాల నాయకులు గుమ్మడిరాజు సాంబయ్య, జనగాం కుమారస్వామి, కన్నం సునీల్, అంకేశ్వరపు రాంచందర్, శ్యాం, చారువాక, ఓంబ్రహ్మేమ్, కళక్క, రాదక్క, మాదాసి సురేష్, కెదాసి మోహన్ సంఘి ఎలేందర్, కేడల ప్రసాద్, కన్నాల రవి, అంబాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు కళాకారులు బి.కె, మచ్చ దేవేందర్, గద్దర్ సాంబయ్య, యోచన, దార దేవేందర్, రామంచ భరత్, సుదమల్ల అశోక్, సురేష్ మహాజన్, మైస ఎర్రన్న, సారంగపాణి, జూపాక శివ, పుల్యాల నరేష్, జోగు రాజు భరత్, డప్పు శ్రీకాంత్, తండ సదన్న, తోట కైలాస్, ఎండి రజియా, ఎర్రబెల్లి విజయ, లోహిత రవి తదితరులు పాల్గొన్నారు.

# మల్లు భట్టి విక్రమార్క ఆశీస్సులతో..
# కిషోర్ కుమార్‌కు కీలక పదవి?

- రెండు కీలక పదవుల్లో పైడిపల్లి కిషోర్ కుమార్ పేరు!
- డీసీసీబీతో పాటు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ రేసులో కిషోర్
- ఖమ్మం డీసీసీబీ చైర్మన్ రేసులో కిషోర్ కుమార్ ముందంజలో?
- రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవికి కూడా కిషోర్ పేరు పరిశీలనలో!
- డీసీసీబీనా.. కార్పొరేషన్ చైర్మన్ పదవినా? ఆసక్తికరంగా మారిన చర్చ

**(మధిర ఆర్సీ భద్రాద్రి న్యూస్ ప్రతినిధి --ఎం. ఇమ్మానియేల్ ):** ఖమ్మం: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్‌కు త్వరలోనే కీలక పదవి దక్కే అవకాశం ఉందన్న ప్రచారం ఖమ్మం జిల్లా రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఖమ్మం జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవితో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఓ కార్పొరేషన్ చైర్మన్ పదవికి కూడా కిషోర్ కుమార్ పేరు పరిశీలనలో ముందంజలో ఉన్నట్లు సమాచారం. పార్టీ అధిష్ఠానం నామినేటెడ్ పదవుల భర్తీపై కసరత్తు చేస్తున్న నేపథ్యంలో కిషోర్ కుమార్ పేరు రెండు కీలక పదవుల విషయంలో వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయిలో డీసీసీబీ చైర్మన్ పదవితో పాటు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవికి కూడా ఆయన పేరును పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కిషోర్ కుమార్‌కు ఉన్న రాజకీయ అనుబంధం నేపథ్యంలో ఆయనకు కీలక బాధ్యత అప్పగించే అవకాశం ఉందనే ప్రచారం మరింత ఊపందుకుంది. దీంతో కిషోర్ కుమార్‌కు ఏ పదవి దక్కనుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. డీసీసీబీ చైర్మన్ పదవా.. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవా? అన్న చర్చ ప్రస్తుతం ఖమ్మం జిల్లా రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. రెండు పదవుల్లో ఏదో ఒక కీలక బాధ్యత కిషోర్ కుమార్‌కు దక్కే అవకాశం ఉందన్న ప్రచారం ఆయన అనుచరులు, పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠను పెంచుతోంది. అయితే ఈ అంశంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకున్న తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. దీంతో కిషోర్ కుమార్‌కు కీలక పదవి దక్కుతుందా? దక్కితే ఏ పదవి లభించనుంది? అన్నది ఆసక్తిగా మారింది.

# కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టే ఒప్పందాలను రద్దు చేయాలి

**- ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి -- పీవైఎల్ రాష్ట్ర నాయకుడు భూక్య శివ నాయక్**



**కారేపల్లి. ఆగస్టు 8(భద్రాద్రి న్యూస్ రాములు):** వ్యవసాయ రంగాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, రైతు--కార్మిక ప్రజలకు వ్యతిరేకంగా చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర నాయకుడు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు.
క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పీవైఎల్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు.
1942లో బ్రిటిష్ పాలకులను దేశం విడిచి వెళ్లాలని డిమాండ్ చేస్తూ క్విట్ ఇండియా ఉద్యమం సాగిందని, అదే స్ఫూర్తితో నేడు దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం నుంచి కాపాడేందుకు ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దెబ్బతీసే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
దేశ సంపదను పెంచేందుకు ప్రధాన ఉత్పత్తి రంగాలైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో నిరంతరం శ్రమిస్తున్న రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల జీవించే హక్కులను కాపాడాలని అన్నారు. రైతులకు పంటల మద్దతు ధరకు చట్టబద్ధమైన గ్యారెంటీ కల్పించాలని, రుణమాఫీ చట్టం చేసి అమలు చేయాలని, పంటల బీమాను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.
విద్యుత్ సవరణ చట్టం--2025ను రద్దు చేయాలని, విత్తన బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతులకు నష్టం కలిగించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన కోరారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మంగన్న, మీసం శ్రీను, పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకులు భాగ్యక్క, రాధా తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలు అంజి మృతికి నామ సంతాపం

**- ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీ**



**కారేపల్లి, ఆగస్టు 8 (భద్రాద్రి న్యూస్ రాములు ):** కారేపల్లి మండలం చిన్నకట్టుగూడెం గ్రామానికి చెందిన మాజీ దిశా కమిటీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్ నాయనమ్మ, శతాధిక వృద్ధురాలు లకావత్ అంజి (101) శనివారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఫోన్‌లో లకావత్ లక్ష్మణ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అంజి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని నామ నాగేశ్వరరావు తెలిపారు.

# కొత్త లింగాల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవ ఎన్నిక

- పగిడిపల్లి కాటయ్య అధ్యక్షులుగా
- ఎరుకల రమేష్ ఉపాధ్యక్షులుగా



**కామేపల్లి,ఆగస్టు 8 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండల పరిధిలోని కొత్త లింగాల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు కార్యదర్శులు ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది వారితోపాటు కార్యవర్గాన్ని అనుబంధ సంఘాల నాయకులను నియమించారు. కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు ఆదేశానుసారం. కొత్త లింగాల గ్రామములో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖను పార్టీ కార్యకర్తల సమావేశపరిచి అట్టి సమావేశంలో ఏకగ్రీవంగా
గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పగిడిపల్లి కాటయ్య
ఉపాధ్యక్షులుగా ఎరకల రమేష్
వర్కింగ్ ప్రెసిడెంట్
రాయల పెద్ద వెంకటేశ్వర్లు
ప్రధాన కార్యదర్శిగా
యడ్లపల్లి శేషగిరిరావు
కార్యదర్శిగా
బైరెడ్డి యుగంధర్ రెడ్డి
ఆర్గనైజింగ్ సెక్రటరీ
గుండ్ల సుధాకర్ శాఖను ఏర్పాటు చేసుకోవడం జరిగినది
కార్యవర్గ సభ్యులు
తడిక మల్ల శ్రీను.
గొడవర్తి శంకర్.
చెరుకుమల్ల శ్రీను.
అడపు శంకర్.
నారాటి రోశయ్య.
పండగ శ్రీను.
అల్లం రాజేష్.
రెంటాల వెంకన్న.
ఎన్నుకోవడం జరిగినది నూతనంగా గ్రామ శాఖ కు ఎన్నికైన సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు.జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్.డి సి సి బి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ జిల్లా నాయకులు తోటకూరి శివయ్య ఓబీసీ జిల్లా అధ్యక్షులు పిఏసిఎస్ కామేపల్లి అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం. కొండాయిగూడెం పి ఎస్ సి ఎస్ అధ్యక్షుడు దనియాక హనుమంతరావు. ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబురు నాయక్ మాజీ జెడ్పిటిసి సరిరామ్ నాయక్ తదితరులు పాల్గొని ఎన్నికైన వారిని అభినందించారు

# సీనియార్టీకి గౌరవం దక్కేనా?.. నామినేటెడ్ పదవిపై మన్నెం అప్పారావు ఆశలు

**- నాలుగు దశాబ్దాల రాజకీయ సేవలకు గుర్తింపు ఇవ్వాలని కాంగ్రెస్ శ్రేణులు, అభిమానుల ఆకాంక్ష**



**భద్రాద్రి న్యూస్ -- దమ్మపేట, ఆగస్టు 8:** తెలంగాణ ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న నామినేటెడ్ పదవుల భర్తీ నేపథ్యంలో దమ్మపేట మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మన్నెం అప్పారావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. నాలుగు దశాబ్దాలకు పైగా పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తున్న ఆయనకు ఈసారి సముచిత గుర్తింపు దక్కాలని మండల కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు కోరుతున్నారు. రెండుసార్లు ప్రజాప్రతినిధిగా ఎన్నికైన మన్నెం అప్పారావు, వివాదరహిత నాయకుడిగా, క్షేత్రస్థాయిలో బలమైన ప్రజాదరణ కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అత్యంత విశ్వాసపాత్రుడిగా పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తున్నారని నాయకులు చెబుతున్నారు. సీనియారిటీ, పార్టీ పట్ల నిబద్ధత, ప్రజాదరణ, కార్యకర్తలతో సత్సంబంధాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నామినేటెడ్ పదవిలో మన్నెం అప్పారావుకు అవకాశం కల్పించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మానవత్వమే మార్గంగా... మృతుల కుటుంబాలకు డాక్టర్ బాదావత్ రవి సానుభూతి

**- లకావత్ అంజి, తాటి దుర్గయ్య మృతిపై సంతాపం వ్యక్తం**



**కారేపల్లి. ఆగస్టు 8(భద్రాద్రి న్యూస్ రాములు ):** సింగరేణి మండలం గుంపెల్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నకట్టగూడెం గ్రామానికి చెందిన ప్రజాపక్షం విలేకరి, మాజీ టీఆర్ఎస్ పార్టీ దిశా కమిటీ సభ్యులు లకావత్ రాము, లకావత్ లక్ష్మణ్‌ల నానమ్మ లకావత్ అంజి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతిపట్ల మిషన్ వాక్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ బాదావత్ రవి సంతాపం వ్యక్తం చేశారు. లకావత్ అంజి మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్న డాక్టర్ బాదావత్ రవి, మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అదేవిధంగా గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన తాటి దుర్గయ్య మృతి పట్ల కూడా డాక్టర్ బాదావత్ రవి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం కుటుంబ సభ్యులు, బంధువులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. సమాజంలో ఎవరికి ఆపద వచ్చినా మానవతా దృక్పథంతో అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డాక్టర్ బాదావత్ రవి అన్నారు. మృతుల కుటుంబాలకు తన వంతు అండగా ఉంటానని, వారి బాధలో భాగస్వామినవుతానని తెలిపారు. ఈ సందర్భంగా గుంపెల్లగూడెం, చిన్నకట్టగూడెం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, యువకులు, గ్రామస్తులు, బంధువులు మృతుల కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు.

# కామ్రేడ్ భూక్యా గోపాల్ కి విప్లవ జోహార్లు



**గుండాల ఆగస్టు 8 భద్రాద్రి న్యూస్ :** గుండాల తండా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రామ కమిటీ సభ్యులు కామ్రేడ్ భూక్య గోపాల్ ఆకస్మిక మరణానికి చింతిస్తూ తన భౌతికకాయం పై న్యూ డెమోక్రసీ పార్టీ జెండాను కప్పి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, గుండాల సర్పంచ్ కోరం సీతారాములు మాట్లాడుతూ కామ్రేడ్ బుక్య గోపాల్ పార్టీ గ్రామ కమిటీ సభ్యునిగా, సింగరేణి కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తూ పార్టీ ఏ పిలుపు ఇచ్చిన పాల్గొని విజయవంతం చేశాడని కొనియాడారు. గుండాల తండాలో అనేకమంది రంగురంగుల జెండాలు మార్చినప్పటికీ నిబద్ధతతో న్యూ డెమోక్రసీ పార్టీ జెండాతో తను చనిపోయే వరకు నిలబడ్డారని అన్నారు. కామ్రేడ్ గోపాల్ లాంటి కార్యకర్త మరణించడం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీకి, విప్ల ఉద్యమానికి ఎంతో నష్టమని అన్నారు. కామ్రేడ్ గోపాల్ మరణాన్ని చింతిస్తూ వారి కుటుంబ సభ్యులకు, మరియు బంధుమిత్రులకు న్యూ డెమోక్రసీ పార్టీ తరఫున ప్రగాఢ సంతాప సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు యాసారపు వెంకన్న, ఈసం కృష్ణన్న, మానాల ఉపేందర్, బానోతు లాలు తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో వాణి వివేకానంద విద్యాలయంలో ఘనంగా బోనాల జాతర

**- అట్టహాసంగా జరిగిన బోనాల పండుగ జాతర**
**- ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వాణి**





**వైరా, ఆగస్టు 8, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ వాని వివేకానంద విద్యాలయంలో ఆషాడ మాస బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు బోనాలు తయారు చేసి అమ్మవారి విగ్రహాలను అలంకరించి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో బోనాల వేడుకలను ప్రారంభించారు. ఈ ఆషాడ మాసం బోనాలు వేడుకలకు ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ వాణి హాజరై అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పండుగలలో ప్రత్యేకమైన పండుగ బోనాల పండుగ అని, మన పూర్వీకుల సాంప్రదాయం, సంస్కృతి లకు ప్రతీకలుగా జరుపుకోవడం చాలా ప్రత్యేకతతో కూడుకున్నదని ఇలాంటి పండుగ వేడుకలను మన పాఠశాలలో నిర్వహించటం వలన చిల్లవయసువంటి మన సంస్కృతి, సాంప్రదాయాలను నేర్చుకుంటూ, గౌరవించుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు తెలియజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతో రంజింప చేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ గింజుపల్లి జనార్ధన్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

